పిడికిలెత్తి దేశాన్ని కాపాడుకోవాలి

- చుట్టూ గోల్‌మాల్ గోవిందుగాళ్లు
- అప్రమత్తంగా లేకుండా వందేళ్లు వెనక్కే !
- ఎన్‌పిఎల పేరుతో రూ.14లక్షల కోట్ల ఆస్తుల అమ్మకం
- జగిత్యాల పర్యటనలో ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన ఎనిమిదేండ్లలో దేశాన్ని లూటీ చేస్తూనే ఉన్నారు. అప్పనంగా.. అయ్యజాగీరులాగా ప్రజల ఆస్తులను సావుకార్లకు దోచిపెడుతున్నారు. మోడీ పార్టీకి నిధులిచ్చే వ్యాపారుల చేతిలోకి విద్యుత్‌రంగాన్ని పెట్టబోతున్నారు. ఎందరో ప్రాణత్యాగాలు చేసిన స్వాతంత్ర్యదేశాన్ని ఆగమాగం చేస్తూ అధోగతిపాలు చేస్తున్నారు. ఇప్పుడు మనమంతా పిడికిలెత్తి దేశాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాలి. అందుకు దేశ రాజకీయాలను ప్రభావితం చేసేదిగా తెలంగాణ ముందుండాలి' అంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ భవనాన్ని, టిఆర్ఎస్ పార్టీ జిల్లా ఆఫీసును ప్రారంభిం చారు. రూ.510కోట్లతో నిర్మించబోతున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా కేంద్ర సమీపంలోని మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన ప్రసంగించారు.

డైలాగుకే పరిమితమైన కేంద్రం వాగ్దానాలు

మేక్ ఇన్ ఇండియా.. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ వంటి నినాదాలు డైలాగులకే పరిమితం అయ్యాయని కెసిఆర్ విమర్శించారు. ఏ ఒక్క రంగంలో అయినా మేక్ ఇన్ ఇండియా చేయని మోడీ... గోర్లు కత్తిరించుకునే కట్టర్ నుంచి దీపావళి టపాసులు, దీపంతలు, పతంగులు ఎగరవేసే దారం వరకూ చైనా నుంచే వస్తున్నాయని వివరించారు. ఆఖరికి దేశ జాతీయ జెండాను సైతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారని విమర్శించారు. మేక్ ఇన్ ఇండియాలో ఏం రాకపోయినప్పటికీ ఉన్నవి ఊడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 10 వేల పరిశ్రమలు మూతపడ్డాయని, ఫ్యాక్టరీల్లో 50 లక్షల మంది ఉద్యోగాలు పోయాయని చెప్పారు. కేంద్రం పాలసీతో 10 వేల మంది పారిశ్రామికవేత్తలు దేశం వదిలిపోయారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే రైతాంగానికి ఏటా రూ.14వేల కోట్లు ఖర్చుపెట్టి ఉచిత కరెంటు ఇస్తుంటే 'రేవుడి కల్చర్'అని, సంక్షేమాలను ఉచితాలంటూ మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్ర సర్కారు ప్రజా అవసరాలకు కాకుండా ఎన్‌పిఎ పేరుతో రూ.14లక్షల కోట్లు సంపన్నులకు రాయితీలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ జో బక్వాస్‌గా మారిందన్నారు. బేటీ పడావో.. బేటీ బచావో అంటూ చెబుతున్న కేంద్ర సర్కారు అంగన్‌వాడీలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఉత్తర భారతదేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై రేప్‌లు, దళితులపై దాడులు నిత్యకృత్యంగా మారిన పరిస్థితిని దేశమంతా చూస్తోందన్నారు. దేశానికి ఏ రంగం ఏ జరిగిందో యువకులు, మేధావులు, విద్యావంతులు ఆలోచన చేయాలని, ఆ విషయాలను గ్రామగ్రామాన యువతకు, ప్రజలకు చెప్పాలని కోరారు.

ఎల్ఐసి ఏజెంట్లు సైనికుల్లా మారాలి..

'ఏ చిన్న పల్లెటూరికి వెళ్లి ఎవరినైనా బీమా చేశావా? అని అడగరని, ఎల్ఐసీ పాలసీ కట్టినవా? అనే అడుగుతారు. అటువంటి ప్రభుత్వ రంగ సంస్థను అప్పనంగా ప్రయివేటుపరం చేస్తున్నారు' అని కెసిఆర్ అన్నారు. 25లక్షల మంది ఏజెంట్లు, లక్షలాది మంది ఉద్యోగులు ఉన్న ఎల్ఐసికి రూ.35లక్షల కోట్ల ఆస్తులు ఉన్నాయని, వాటిని దోచుకునేందుకు కేంద్రం పని గట్టుకుందన్నారు. ఎల్ఐసిని సంస్థ ఉద్యోగులు, ఏజెంట్లే కాదు.. ప్రజలూ కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దండంపెట్టి మాట్లాడుతున్న..

తెలంగాణలో మనం అధికారంలోకి వచ్చినప్పుడే కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని కనీసం ఆయన తన సొంత రాష్ట్రంలో సరిపడా కరెంటు, దేశ రాజధానిలో కడుపునిండా మంచినీళ్లు ఇవ్వలేకపోయారని అన్నారు. ఏ ఒక్క రంగంలోనూ మంచి పని చేయకపోగా వందేండ్లు వెనక్కిపోయేలా పాలన సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే మతపిచ్చిలో పడి అన్నిరకాలుగా వెనుబడిపోతున్నాం. ఇప్పటికైనా మేల్కోకపోతే వందేళ్లు వెనక్కిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 'దండం పెట్టి మాట్లాడుతున్నా.. నా వెంట నడవండి.. దేశ రాజకీయాలను తెలంగాణ రాష్ట్రమే ప్రభావితం చేయాలి. దేశం పిడికిలెత్తి ప్రజల ఆస్తులను కాపాడుకోవాలి' అంటూ పిలుపునిచ్చారు.

ప్రజా సం'క్షేమమే' సర్కారు ధ్యేయం

దేశంలో ఎక్కడా ధాన్యం కొనడం లేదని, రాష్ట్రంలోనే ఏడువేల కొనుగోలు కేంద్రాల ద్వారా ఎక్కడికక్కడ పంటను కొంటుంది తెలంగాణ మాత్రమేనని కెసిఆర్ తెలిపారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలూ ఇక్కడే అమలవుతున్నాయని, కెసిఆర్ బతికున్నంతకాలం అవి ఆగవని స్పష్టం చేశారు. మరో ఐదు, పది రోజుల్లో రైతుబంధు అన్నదాతల ఖాతాలో పడుతాయని, రెండు రోజుల్లో క్యాబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లక్షలాది బిడి కార్మికులకు రూ.2016 ఇస్తుందీ తెలంగాణ మాత్రమేనన్నారు. ఆడపిల్ల పెండ్లికి కళ్యాణలక్ష్మి, ఆమె ప్రసవిస్తే కెసిఆర్ కిట్ వంటి సంక్షేమం అందిస్తుంది మనమేనన్నారు.

కొండగట్టుకు రూ.100కోట్లు...

కొండగట్టు దేవస్థానానికి రూ.100కోట్లు ఇస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటికే ఆలయానికి 25 ఎకరాల స్థలమే ఉంటే మరో 385 ఎకరాలు కేటాయించామని గుర్తు చేశారు. ఇవేగాకుండా మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్‌ను మండలంగా చేస్తామని ప్రకటించారు. కరీంనగర్, జగిత్యాల జిల్లాలోని నియోజకవర్గాలకు అదనంగా రూ.10కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. పర్యటనలో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎసిబి కోర్టు పరిధి దాటి వ్యవహరిస్తోంది

హైకోర్టులో సిట్ పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో మెయినాబాద్ పోలీసులు దాఖలు చేసిన మెమోను ఎసిబి ప్రత్యేక కోర్టు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ సిట్ హైకోర్టును ఆశ్రయించింది. సిట్ తరఫున అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ బుధవారం వాదనలు వినిపించారు. ఎసిబి కోర్టు పరిధి దాటి వ్యవహరిస్తోందని, పోలీసులు దాఖలు చేసిన మెమోను తిరస్కరించడం సరైంది కాదని ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేలకు ఎర కేసులో బీఎల్ సంతోష్, తుషార్, జగ్గుస్వామి, శ్రీనివాస్‌లను సిట్ అధికారులు నిందితులుగా చేర్చారని.. దర్యాప్తులో సేకరించిన కీలక వివరాల ఆధారంగానే పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారని వాదించారు. కానీ, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 8 కింద దర్యాప్తు చేసే అర్హత సిట్‌కు లేదని నిర్ణయిస్తూ ఎసిబి ప్రత్యేక కోర్టు మెమోను కొట్టివేసిందని ఎజి ప్రసాద్ కోర్టు దృష్టికి తెచ్చారు.

రేపటి నుంచి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ

- తొలిరోజు బహిరంగ సభ నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా కేంద్రంలో 9, 10 తేదీల్లో తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభ నిర్వహించనున్నట్టు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ తెలిపారు. 9న బహిరంగ సభ ఉంటుందనీ, దాన్ని జయప్రదం చేయాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, ఉపాధ్యక్షులు ఆర్.కోటంరాజు, రాష్ట్ర నాయకులు ప్రసాద్, సోమన్న, శ్రీకాంత్, సునిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. తమ యూనియన్ రాష్ట్ర మహాసభను కామారెడ్డిలోని మల్లుస్వరాజ్యం నగర్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. మహాసభకు ముఖ్య వక్తలుగా సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు, మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి వక్తలుగా తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగారపు ఎల్లయ్య, సిఐటియు కామారెడ్డి జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు.

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి

- సిపిఐ కూనంనేని సాంబశివరావు
- చలో రాజ్‌భవన్‌లో ఉద్రిక్తత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడనప్పుడు గవర్నర్ వ్యవస్థ ఎందుకని ప్రశ్నిస్తూ, తెలంగాణ గవర్నర్ తమిళిసై తీరును నిరసిస్తూ బుధవారం ఛలో రాజ్‌భవన్‌కు సిపిఐ పిలుపునిచ్చింది. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ చాడ వెంకట్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు రాజ్‌భవన్ ముట్టడికి బయల్దేరారు. అయితే ముందుగానే ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌తో పాటు రాజ్‌భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సిపిఐ నేతలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటు చేసుకుని ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ క్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డితో సహా వందలాది సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. దాంతో అరెస్టులను అడ్డుకునేందుకు ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ క్రమంలో పలువురు నాయకులకు గాయాలయ్యాయి. అరెస్టయిన వారిని నగరంలోని ఏడు పోలీసు స్టేషన్‌లకు తరలించారు. అనంతరం అక్రమ అరెస్టులకు నిరసనగా సిపిఐ కార్యకర్తలు నాంపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్టయిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, ఎన్.బాల మల్లేశ్, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, కళవేన శంకర్, బాల నర్సింహా, బాగం హేమంత్ రావు, ఇ.టి.నరసింహా, వివిధ జిల్లాల కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు. అంతకు ముందు మీడియాతో కూనంనేని మాట్లాడుతూ.. గవర్నర్ వ్యవస్థ ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా పనిచేసినట్టు ఇప్పటివరకు ఆధారాలు లేవని, గవర్నర్ వ్యవస్థతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందన్నారు. అందుకే ఈ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కవితపై కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని, అసలు లిక్కర్ కేసు ఏంటో అర్థం కావడం లేదన్నారు. టిడిపిలో ఉన్నప్పుడు సుజనా చౌదరి, సిఎం రమేష్‌లపై దాడులు చేశారన్నారు. వాళ్ల బిజెపిలో చేరగానే పునితులయ్యారని ఎద్దేవా చేశారు. అరెస్టయిన సిపిఐ నాయకులు, కార్యకర్తలను నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పరామర్శించారు. బిజెపి ప్రభుత్వం గవర్నర్‌లను అడ్డుపెట్టుకొని బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని, తెలంగాణ, కేరళ, తమిళనాడులో గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు ఇందుకు అద్దం పడుతున్నదన్నారు

సైనిక సంక్షేమానికి సిఎస్ విరాళం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే సందర్భంగా సిఎస్ సోమేశ్ కుమార్ విరాళం అందజేశారు. బుధవారం హైదరాబాద్ బిఆర్ కెఆర్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్, రిటైర్డ్ కల్నల్ పి.రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

గుజరాత్‌కే నిధులిస్తారా?

- కేంద్రాన్ని ప్రశ్నించిన బోయినపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర నిధుల విడుదల విషయంలో వివక్ష చూపుతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. గడచిని తొమ్మిది నెలల్లో ఒక్క గుజరాత్ రాష్ట్రానికే తొమ్మిది నెలల్లో రూ. ఒక లక్షా 37 వేల 655 కోట్ల విలువైన ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఇతర పనుల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆ రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని మోడీ నిధుల వరదను పారించారని విమర్శించారు. 40 సార్లు ఆ రాష్ట్రంలో పర్యటించి, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని వివరించారు. ఇదే తరహా నిధుల కేటాయింపు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి హోదాలో దేశంలోని అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యతను మోడీ విస్మరిస్తున్నారనీ, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న హరగోపాల్

మెరుగైన సమాజం కోసం...ప్రశ్నించండి

- ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెరుగైన సమాజం కోసం విద్యార్థులు ప్రశ్నించాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో పిడిఎస్‌యు 22వ మహాసభ సందర్భంగా ఆర్‌టిసి కల్యాణ మండపం నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రశ్నించేందుకు జ్ఞానం అవసరమనీ, ఆ జ్ఞానం విద్య ద్వారా లభిస్తుందని తెలిపారు. ప్రజలు ప్రశ్నించడం ఇష్టం లేని ప్రభుత్వాలు విద్యకు బడ్జెట్ తగ్గిస్తున్నాయని విమర్శించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తామని అధికారంలోకి వచ్చిన పాలకవర్గాలు ఎనిమిదేండ్లుగా విద్యావ్యవస్థను ధ్వంసం చేశాయని చెప్పారు. పేద దళిత, గిరిజన వర్గాలకు విద్యను దూరం చేస్తూ సంపన్న వర్గాలు మాత్రమే డబ్బిచ్చి కొనేలా కార్పొరేట్, ప్రయివేటు విద్యను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యలో కాషాయీకరణ, అశాస్త్రీయ భావజాలాన్ని జొప్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠ్యాంశాల్లో అశాస్త్రీయ అంశాలు పెడుతున్నారని తెలిపారు. ప్రశ్నించడమే నిజమైన విద్య అని స్పష్టం చేశారు. సిపిఐ(ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు ఒకటేననీ, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సిట్ వర్సెస్ ఇడిగా టిఆర్ఎస్, బిజెపి పోటీ పడుతున్నాయనీ, చివరకు ఇద్దరు రాజీ పడతారని ఆరోపించారు. గుజరాత్ మోడల్ అంటే పాఠశాలల్లో మరుగుదొడ్లు, టీచర్లు లేకపోవడమని విమర్శించారు. మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. సమసమాజం కోసం జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌ల స్ఫూర్తిగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవస్థ మార్పు కోసం అన్ని పోరాటాల్లో పాల్గొనాలని సూచించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయినపల్లి రాము మాట్లాడుతూ.. ఆత్మహత్యలు, ఆకలిచావులు, నిరుద్యోగం లేని సమాజం కోసం విద్యార్థులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, సిపిఐ(ఎంఎల్) ప్రజా పంథా నగర కార్యదర్శి ఎం.హన్మేష్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వాతి, పృథ్వి, భాస్కర్, ఎస్.అనిల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆజాద్, గణేష్, నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.సుమంత్, టిపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మనోహర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

15న ద.మ.రైల్వేలో పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే విశ్రాంత ఉద్యోగుల కోసం ఈనెల 15న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు నాందేడ్ జోన్లలోని వర్క్‌షాప్‌లు, ఇతర యూనిట్లలో వేర్వేరుగా ఈ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో విశ్రాంత రైల్వే ఉద్యోగుల అభ్యర్థనలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలు దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్ షుషు.ఎంతీ.అఅఎఖుఅ–తీఖుఅశ్రీఖుఎం.స్త్రశీజ.అఅలో ఉన్నాయనీ, పెన్షనర్లు నిర్దేశించిన నమూనాలో తమ ఫిర్యాదులను వెబ్‌సైట్ ద్వారా పంపవచ్చని వివరించారు.

సింగరేణిలో కాగితం వాడొద్దు

- ఒక్క ఏరియానైనా ఇ-ఆఫీస్‌గా మార్చాలి
- అధికారులకు సంస్థ డైరెక్టర్ల ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటున్నామనీ, దానిలో భాగంగా సింగరేణిని కాగితం రహిత కంపెనీగా రూపుదిద్దాలని ఆ సంస్థ డైరెక్టర్లు ఎస్ చంద్రశేఖర్, ఎన్ బలరాం అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా కనీసం ఒక ఏరియాను ఈ - ఆఫీస్‌గా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. యాత్రా స్థలాల్లో ఆన్‌లైన్ వసతి బుకింగ్‌కు సంబంధించి బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ పారదర్శకంగా ఉండి ప్రతీ ఉద్యోగికి సెల్‌ఫోన్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ ఐటీ విభాగంలో కోలిండియాకు ఆదర్శంగా ఉన్నదనీ, దాదాపు పదేండ్ల క్రితమే సంస్థలో ఈఆర్‌పీని ప్రారంభించినట్టు తెలిపారు. అదే సాంకేతికతను ఇప్పుడు కోలిండియా అమలు చేస్తున్నదని ఉదహరించారు. సింగరేణి సేవా సమితి, సింగరేణి పబ్లిక్ రిలేషన్స్ శాఖలకు ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించిన ఐటీ విభాగాన్ని జనరల్ మేనేజర్(కో ఆర్డినేషన్) ఎమ్ సురేశ్ అభినందించారు.

సింగరేణిపై మాట తప్పారు

- నామా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణిని ప్రైవేటీకరించమంటూ రామగుండంలో చెప్పిన ప్రధాని నరేంద్రమోడీ ఇప్పుడు ఆ సంస్థకు చెందిన బొగ్గుబ్లాకుల్ని వేలం వేస్తున్నారని టిఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు కేంద్రంపై మండిపడ్డారు. బుధవారంనాడాయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తక్షణం సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపేయాలని కోరారు. కోల్ బ్లాకులు లేకుండా సింగరేణి ఎలా నడుస్తుందని ప్రశ్నించారు. సింగరేణిని ప్రైవేటీకరించవద్దని గతంలో సిఎం కెసిఆర్ ప్రధానికి పలుమార్లు లేఖలు రాశారనీ, ప్రధాని కూడా రామగుండం వచ్చినప్పుడు ప్రైవేటీకరించబోమని చెప్పారని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బుధవారం తమ పార్టీ ఎంపిలు పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నలకు సింగరేణి నాలుగు బ్లాకులను ప్రైవేటీకరిస్తున్నామని సమాధానం ఇచ్చారని చెప్పారు. ఇది అన్యాయమని అన్నారు. దేశ వ్యాప్తంగా 38 బ్లాకులను అమ్ముతున్నట్టు కేంద్రం చెబుతున్నదన్నారు. తెలంగాణ అంటే కేంద్రానికి చిన్న చూపు అనీ, రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటూ, గనులు కూడా లేకుండా అమ్మకానికి పెట్టారని ఆక్షేపించారు. రాష్ట్రానికి చేసిన అన్యాయాలు, నిధుల నిలిపివేత, విభజన హామీల అమలులో వైఫల్యం, దివాలాకోరు రాజకీయాలు తదితర అంశాలపై పార్లమెంటులో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరు

వ్యకాస జాతీయ కమిటీ సభ్యులు ప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండ్ల స్థలాల కోసం నిరుపేదలు అనేక ఏండ్లుగా ఎదురు చూసి.. విసిగి వేసారి, ప్రభుత్వం మీద, అధికారుల మీద ఆశలు వదులుకొని ప్రత్యక్ష పోరాటాల్లోకి వస్తున్న వారిని దౌర్జన్యంగా అణిచే ప్రయత్నం చేయడం అత్యంత నీతిమాలిన చర్య అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు బి. ప్రసాద్ అన్నారు. బుధవారం జనగామ జిల్లా లింగాల గణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు ఇంటి స్థలాల కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చదును చేసుకుంటుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్న విషయాన్ని తెలుసుకొన్న ఆయన భూ పోరాట కేంద్రాన్ని సందర్శించి వారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, మూడు ఎకరాల సాగు భూమి ఇస్తామని వాగ్దానం చేసి ఎనిమిదేండ్లు గడిచిందన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోగా.. కొత్త కొత్త పథకాలను మళ్లీ మళ్లీ ప్రవేశ పెడుతూ ప్రజలను మోసం చేస్తున్నదని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం మనిషికి జీవించే హక్కు ఉందని, అందుకు తప్పనిసరైన ఇల్లు నిర్మించుకోవడానికి అవసరమైన జాగా లేని ఎంతోమంది నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే వారిపై దౌర్జన్యం చేస్తూ జీవించే హక్కును కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



పేదలతో మాట్లాడుతున్న ప్రసాద్

మరోవైపు కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను పలుకుబడి కలిగిన వాళ్లు ఆక్రమించుకుంటుంటే పట్టించుకోవట్లేదని, పేదలు ఆక్రమించుకుంటే మాత్రం ఎక్కడలేని చట్టాలు గుర్తొస్తాయని విమర్శించారు.

ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఈ భూ పోరాటాన్ని ఆపేది లేదని అన్నారు. ఈ సందర్భంగా భూమిని చదును చేస్తున్న పేదలను ఆపేందుకు వచ్చిన స్థానిక పోలీసులు, పేదలకు మధ్య వాగ్వాదం జరిగింది. ప్రజలు గట్టిగా నిలబడటంతో నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్లారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేసి, పోలీసు నిర్బంధాన్ని ఆపకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రజలు, నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సింగారపు రమేష్, వెంకటరాజం, ఉపాధ్యక్షులు గంగాపురం మహేందర్, సాంబరాజు దుర్గాప్రసాద్, గోసంగి శంకరయ్య తదితరులతోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన దళితులు, పేదలు, పాల్గొన్నారు.



పరిశ్రమ విద్యపై వర్క్‌షాప్

హైదరాబాద్ : జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజీ అండ్ సైన్స్ యాజమాన్యం 'పరిశ్రమల్లో గణితం, మానవీయ సంబంధం అంశం'పై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించింది. విద్యా, పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్ఎఫ్ ఐటి సెంటర్ డిజిఎం డాక్టర్ వేణుగోపాల్ జారుగుమల్లి, మైక్రోసాఫ్ట్ ప్రాజెక్టు మేనేజర్ శతాబ్ది నాయక్, డెలాయిట్ మేనేజర్ అర్చన దామరాజు, ఆంధ్ర మహిళ సభా రిటైర్డ్ ప్రిన్సిపల్ జిఎల్‌కె దుర్గా, ఇస్రో సైంటిస్ట్ డి సధీర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పాటనే ఇంటి పేరుగా మార్చుకున్న బండి యాదగిరి

ప్రజాశక్తి - కల్చరల్

బండెనక బండి కట్టి పదారు బండ్లు కట్టి పాటను రాసి దొరల గుండెల్లో గుబులు రేపిన యాదగిరి తెలంగాణా ప్రజల గుండెల్లో బండి యాదగిరిగా స్థిరపడ్డారని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి జయంతి సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ బండెనక పాటను రాసిన యాదగిరి గన్ను పట్టి పోరాటంలో పాల్గొన్న యోధుడని కొనియాడారు. ప్రముఖ రచయిత వెన్నెలకన్ను రమణ తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర వివరిస్తూ బండెనక బండి కట్టి పాట ప్రతాపరెడ్డి దొరను ఉద్దేశించి రాసినదని, మా భూమి సినిమాలో నిజాం పేరు చేర్చారని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ జి.వల్లీశ్వర్ మాట్లాడుతూ బండి యాదగిరి వంటి త్యాగధనుల వల్లనే నేడు తెలంగాణ విముక్తి చెందిందని వారి చరిత్ర నేటి యువతకు స్ఫూర్తి ఇవ్వాలని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సూరి భగవంతం ట్రస్ట్ స్థాపకుడు ఎస్.బి.రాం తదితరులు పాల్గొనగా బండి శ్రీనివాస్ వందనసమర్పణ చేశారు.

22 నుంచి జాతీయ పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - కల్చరల్

ఈ నెల 22 నుంచి జనవరి 1వ తేదీ వరకు ఎన్‌టిఆర్ స్టేడియంలో కళా భారతిలో జాతీయ పుస్తక ప్రదర్శనకు అనుమతి పర్యటక సంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చారని హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్ అధ్యక్షుడు జాలూరి గౌరీ శంకర్ తెలిపారు. ఎప్పటిలాగే పిల్లలకు, పెద్దలకు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సత్యానంద్‌కు ఆదుర్తి ఆత్మీయ పురస్కారం

ప్రజాశక్తి - కల్చరల్

ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, సారిపల్లి కొండలరావు సహకారంతో రవీంద్రభారతి సమావేశ మందిరంలో సినీ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, నటి సావిత్రిల జయంతి, నటుడు కృష్ణ సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ మధుసూదనరావు పాల్గొని ప్రముఖ సినీ రచయిత సత్యానంద్‌కు ఆదుర్తి ఆత్మీయ ప్రతిభా పురస్కారం బహూకరించి మాట్లాడుతూ సత్యానంద్ సంభాషణల రచనలో ప్రావీణ్యుల న్నారు. నాటి నటులు ఎఎన్ఆర్, ఎన్‌టిఆర్ నుంచి నేటి నటులు పవన్ కల్యాణ్ వరకు వందల చిత్రాలకు మాటలు రాసి ఆ సినిమాల విజయానికి భాగస్వామి అయ్యారని వివరించారు. సారిపల్లి కొండల రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆదుర్తి, సావిత్రిల మూగ మనసులు గొప్ప సినిమా అని, కృష్ణను చిత్ర రంగానికి పరిచయం చేసింది ఆదుర్తి అని గుర్తు చేశారు. వేదికపై దర్శకుడు ఆదిత్య, రచయిత్రి పల్లవి, జర్నలిస్ట్ రమేష్ బాబు, సినీ రచయిత ఎస్.వి.రామారావు పాల్గొన్నారు.

హలో విద్యార్థి... చలో హైదరాబాద్

- 13 నుంచి ఒయులో ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభ
- తొలిరోజు నెక్లెస్‌రోడ్ నుంచి పీపుల్స్ ప్లాజా వరకు ప్రదర్శన
- బహిరంగసభకు ముఖ్యఅతిథిగా త్రిపుర మాజీ సిఎం మాణిక్‌సర్కార్
- మహాసభను ప్రారంభించనున్న జస్టిస్ కె చంద్రు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత 17వ మహాసభకు ఉద్యమాల పురిటిగడ్డ హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఒయు) వేదికైంది. ఈ మహాసభ ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. మొదటిరోజు హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం నుంచి వేలాది మంది విద్యార్థులతో ప్రదర్శన ప్రారంభమవుతుంది. పీపుల్స్‌ప్లాజా వద్ద బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ హాజరవుతారు. అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత 17వ మహాసభల్లో భాగంగా జస్టిస్ కె చంద్రు ప్రతినిధుల సభను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం చైర్మెన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, గౌరవ చైర్మెన్ ఘంటా చక్రపాణి, ముఖ్య సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను, ప్రధాన కార్యదర్శి మయూక్ విశ్వాస్‌తోపాటు జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొంటారు. ఈ మహాసభకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 800 మంది ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారు. ప్రారంభసభ సందర్భంగా ఠాగూర్ ఆడిటోరియంలో జెండావిష్కరణ కోసం అలంకరణ చేస్తున్నారు. 'హలో విద్యార్థి... చలో పోదాం హైదరాబాద్' అని నినదిస్తున్నారు.

నగరం ముస్తాబు

ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభ కోసం హైదరాబాద్ మహానగరం ముస్తాబవుతున్నది. ఇందుకోసం ఆహ్వానసంఘం ఏర్పాట్లు చేస్తున్నది. ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, ఇతర ప్రజాసంఘాల నాయకులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ వాల్‌రైటింగ్స్ రాశారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, తోరణాలను ఏర్పాటు చేశారు. జెండాలు కడుతున్నారు. ఈ మహాసభను పురస్కరించుకుని వెయ్యికిపైగా సెమినార్లు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై చర్చించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానం-2020పైనా అవగాహన కల్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అమరవీరుల ఫొటోలతో హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 14న రెండోరోజు ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన మాజీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఉంటుంది. సీతారాం ఏచూరి, ప్రకాశ్‌కరత్, నీలోత్పల్‌బసు, బీమన్‌బసు, కెఎన్ బాలగోపాల్, ఆర్ అరుణ్‌కుమార్, శివదాసన్, కెకె రాగేష్, విక్రంసింగ్ తదితరులు పాల్గొని సందేశాలనిస్తారు.



క్లౌడ్ బ్లేజ్‌టెక్‌ను ఆవిష్కరించిన టెక్ మహీంద్రా

హైదరాబాద్ : ప్రముఖ ఐటి కంపెనీ టెక్ మహీంద్రా బుధవారం కొత్తగా క్లౌడ్ బ్లేజ్‌టెక్‌ను ప్రారంభించింది. దీన్ని బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ఆవిష్కరించింది. అంతర్జాతీయంగా క్లౌడ్ సేవల్లో పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. క్లౌడ్ బ్లేజ్‌టెక్ మౌలిక వసతుల ట్రాన్స్‌ఫర్మేషన్, సంస్థలకు సాయంగా నిలువనుందని టెక్ మహీంద్రా ఇన్‌ఫ్రా అండ్ క్లౌడ్ బిజినెస్ గ్లోబల్ హెడ్, చీఫ్ డెలివరీ ఆఫీసర్ సుధీర్ నయ్యర్ తెలిపారు.

ఇతర కంపెనీలతో పోల్చితే క్లౌడ్ బ్లేజ్‌టెక్ సేవలు 25-30 శాతం వరకు చౌకగా లభించనున్నాయన్నారు. క్లౌడ్ సర్వీసెస్ గ్లోబల్ హెడ్ సురి చావ్లా మాట్లాడుతూ తమ వేదిక ఖాతాదారులకు అనుగుణమైన కస్టమైజ్డ్ సేవలను అందిస్తుందన్నారు.

సైనికుల సేవలు వేల కట్టలేనివి

- గవర్నర్ తమిళి సై



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సైనికులు చేసే సేవలు వేల కట్టలేనివని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ కొనియాడారు. సాయుధ దళాల పతాక దిన్సోతవం-2022 సందర్భంగా ఈ ఏడాది సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి హైదరాబాద్ ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి అత్యధికంగా విరాళాలు సేకరించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ మేరకు బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై హైదరాబాద్ ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి, వారి సిబ్బందిని అభినందించి వారికి రోలింగ్ ట్రోఫీని బహుకరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. సైనికుల కోసం నిధులు సేకరించడం చాలా సంతోషమని తెలిపారు. సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి అత్యధికంగా విరాళాలు సేకరించడం అభినందనీయమని, సైనికుల కుటుంబాలకు ఈ నిధిని సక్రమంగా అందేలా చూస్తానని చెప్పారు. అనంతరం హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుని శ్రీనేష్ కుమార్ వారి సిబ్బంది, ఎన్‌సీసీ కేడట్స్‌తో కలిసి స్టిక్కర్‌ను అందించి ఆయన నుంచి విరాళాలను సేకరించారు.

పోడు సమస్య పరిష్కారంలో జాప్యం వద్దు



- సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి
- ప్రజా సమస్యల పరిష్కారంపై పోరులో రాజీలేదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగులో ఉన్న ప్రతి పోడు సాగుదారునికి హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని లారీ అసోసియేషన్ హాల్లో సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం కొక్కెరపాటి పుల్లయ్య, కారం పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ.. మునుగోడు ఎన్నికల సందర్భంగా వామపక్షాలు టిఆర్ఎస్‌కి మద్దతు ఇచ్చిన సందర్భంలో పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని సిపిఎం చేసిన డిమాండ్ మేరకు ప్రభుత్వం గ్రామాల్లో పోడు సర్వే నిర్వహించిందని గుర్తు చేశారు. సర్వే కూడా హామీ ఇచ్చినట్టుగా పూర్తిస్థాయిలో నిర్వహించలేదని, తక్షణమే సర్వేలను పూర్తి చేసి గ్రామసభలు తీర్మానం చేసిన పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి పోడు సమస్యను పరిష్కారం చేయకపోవడంతోనే చంద్రుగొండలో ఫారెస్ట్ అధికారిపై దాడి జరిగిందని, ఒక్క ఘటన ఆధారంగా మొత్తం వలస ఆదివాసీలకు చెందిన పోడు భూముల సర్వే నిలిపివేయడం అన్యాయమన్నారు. గతంలో సాగు చేసుకుంటున్న వారి దగ్గర నుంచి ఫారెస్ట్ అధికారులు బలవంతంగా భూమిని గుంజుకొని మొక్కలు నాటడంతో తమ భూమిని కోల్పోయిన పోడు సాగుదారులందరినీ గుర్తించి తక్షణమే వారికి ఆ భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు. ధరణి సమస్యను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు. సొంతింటి స్థలం ఉన్నవారికి ప్రభుత్వం ప్రకటించిన రూ.3 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోవని, ప్రభుత్వ నిర్మించే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకే రూ.5 లక్షలు ఖర్చవుతుంటే రూ.3 లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న ఇండ్లకు పట్టాలిచ్చి పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే పొత్తుల వ్యవహారాల గురించి మాట్లాడతామని, మిగతా సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలు చేయడంలో వెనకాడబోమని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి భవిష్యత్తు పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, మందలపు జ్యోతి, నర్సారెడ్డి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశం నుంచి పడిన మిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



వికారాబాద్ జిల్లాలో ఆకాశం నుంచి నేలపై పడిన వింత మిషన్ కలకలం సృష్టించింది. విచిత్రంగా ఉన్న ఆ మిషన్ నేలపై పడటంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మర్పల్లి మండలంలోని మొగిలిగుండ్ల గ్రామంలో బుధవారం ఉదయం సమీప పంట పొలాల్లో వింత మిషన్ నేలజారింది. ఆకాశంలో ఎగిరిన ఈ వింత మిషన్ అంతకుముందు సరిగ్గా ఉదయం 7-30 గంటలకు హైదరాబాద్ ప్రాంతంలో ఎగిరింది. హైదరాబాద్‌లో కనిపించిన వింత మిషన్ వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం మొగ్గిలిగుండ్ల గ్రామం పంట పొలాల్లో పడింది.

ముందుగా నేలపై పడిన విషయాన్ని గమనించిన గ్రామస్తులు భారీ ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని ఆశ్చర్యానికి గురయ్యారు. వింతగా కనిపించిన మిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని.. రైతులు, ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. వింత మిషన్‌పై ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ మీడియాతో మాట్లాడారు. ఇది నేషనల్ బెలూన్ ఫెసిలిటీ ప్రయోగించిన రీసెర్చ్ బెలూన్ అని తెలిపారు. పర్యావరణ అధ్యయనాల కోసం ప్రయోగించినట్టు చెప్పారు. వాతావరణ పరిశోధన కోసం ఈ మిషన్‌ల ద్వారా ఆకాశంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, తేమతో పాటు గాలి వేగంలో మార్పులను కొలవడానికి సహాయపడతాయని వివరించారు. అంతేకాకుండా వాతావరణ సూచనలో సహాయపడే వాతావరణ సౌండింగ్ గ్రాఫ్‌లను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ప్రయోగాల విషయమై గత నెల అనుమతులు నోటీసు కూడా జారీ చేసినట్టు స్పష్టం చేశారు.



మాస్‌చిప్ ఇన్‌స్టిట్యూట్ కొత్త కేంద్రం ఏర్పాటు

హైదరాబాద్: విఎల్ఎస్ఐ, ఎంబెడ్డెడ్ సిస్టమ్స్ రంగంలో అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్న మాస్‌చిప్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిలికాన్ సిస్టమ్స్ తన అత్యాధునిక కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. రాయదుర్గం నాలెడ్జ్‌సిటీలోని అరబిందో గెలాక్సీలో 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక వసతులతో దీన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఫిజికల్ డిజైన్, అనలాగ్ లేఔట్, డిజైన్ వెరిఫికేషన్, ఎంబెడ్డెడ్ సిస్టమ్స్ విభాగాల్లో ఏటా 600 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయని ఆ సంస్థ పేర్కొంది. విద్యార్థులకు మరింత మెరుగ్గా శిక్షణ ఇచ్చేందుకు ఇడిఎ టూల్ ప్రొవైడర్ కాడెన్స్ డిజైన్ సిస్టమ్స్‌తో ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. మాస్‌చిప్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిలికాన్ సిస్టమ్స్‌ను సెమీకండక్టర్ల తయారీ దిగ్గజం మాస్‌చిప్ టెక్నాలజీస్ ప్రమోట్ చేస్తోంది. ఈ కేంద్రం 2011 నుంచి వేలాది మందికి శిక్షణ ఇచ్చిందని మాస్‌చిప్ ఎండి, సిఇఒ వెంకట సింహాద్రి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ సెమీకండక్టర్ కంపెనీల్లో తమ అభ్యర్థులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా పరిశ్రమకు అభ్యర్థులను అందించేందుకు ఈ కేంద్రం దోహదం చేస్తుందని చెప్పారు.



గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ స్వప్నం హరిత భారత్, హరిత తెలంగాణ

- ఎంపి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హరిత భారత్, హరిత తెలంగాణ సాధనే గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్వప్నమని ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. సిఎం కెసిఆర్ స్ఫూర్తితో ప్రేరణ పొందుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ములుగు ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆవరణంలో ఆయన మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థుల మధ్య మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. బీడుగా ఉన్న రాష్ట్రాన్ని స్వరాష్ట్ర సాధన తర్వాత హరితమయంగా మార్చాలన్న సంకల్పంతో సిఎం కెసిఆర్ తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని తీసుకున్నారనీ, దాని నుంచే స్ఫూర్తి పొంది తాను గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. విదేశాల్లోని తెలుగు వారు కూడా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్ఫూర్తితో మొక్కలు నాటడం గొప్ప విషయమని చెప్పారు.

చోరీ కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరం నాగోల్‌లోని స్నేహపూరి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 1న మహదేవ్ జ్యూవెలరీ దుకాణంలో జరిగిన చోరీ కేసులో ఆరుగురు అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. బుధవారం ఎల్‌బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్, అడిషనల్ డీజీ మహేష్ మురళీధర్ భగవత్ వివరాలను వెల్లడించారు. మహదేవ జ్యూవెలరీ షాపులో ఈ నెల 1న ఇద్దరిపై దుండగులు కాల్పులు జరిపి బంగారం దోచుకెళ్లారని సమాచారం రావడంతో వెంటనే అక్కడకు చేరుకుని కాల్పుల్లో గాయపడ్డ సుఖ్‌దేవ్, సుఖ్‌రామ్‌లను స్థానిక ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. అనంతరం సిసిఎస్, ఎస్ఓటీ, క్రైమ్ టీంలు దర్యాప్తు ప్రారంభించాయన్నారు. ముసుగు ధరించి బైక్‌పై వచ్చిన నలుగురు వ్యక్తులు షాపులోకి చొరబడి గణపతి జ్యూవెలరీ నుంచి తెచ్చిన గోల్డ్ బ్యాగ్ ఇవ్వాలని దుకాణ యజమానిని బెదిరించారు. అందుకు యజమాని ఒప్పుకోకపోవడంతో కాల్పులు జరిపి బంగారంతో అక్కడి నుంచి పరారయ్యారు. సిసిఫుటేజీ సాక్ష్యాలను సేకరిస్తూ దర్యాప్తును ముందుకు తీసుకెళ్లినట్టు, మొదట నంబర్ ప్లేట్ లేని పల్సర్ బైక్ ఉందని, దర్యాప్తులో భాగంగా మరో స్కూటీకి సంబంధించిన చిన్న క్లూ దొరికిందని సిపి చెప్పారు. వాటి ఆధారంగా ఆరుగురు నిందితులను పట్టుకున్నామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని చెప్పారు. రాజస్థాన్‌కు చెందిన ప్రధాని నిందితుడు మహేంద్ర చౌదరి గతంలో గుజరాత్‌లో బంగారం షాపు నడిపాడని పోలీసులు తెలిపారు.

అనంతరం నాలుగేండ్ల కిందట గజ్వేల్‌కు వచ్చి జ్యూవెలరీ షాపు పెట్టాడని తెలిపారు. ఈ క్రమంలో ఓ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి రెక్కీ నిర్వహించి ఈ చోరీకి పాల్పడ్డారని వివరించారు. దోపిడీ జరుగుతున్న సమయంలో మహేంద్ర చౌదరి ఉప్పల్‌లోని ఓ బార్‌లో ఉన్నాడని, చోరీ అనంతరం బంగారం బ్యాగ్‌ను కొండపాకలోని సుమిత్ డాగర్ అనే వ్యక్తి ఇంట్లో పెట్టారన్నారు. అనంతరం మహేంద్ర చౌదరి భార్య గుడియా జాత్‌ను గజ్వేల్ నుంచి తీసుకొని నిర్మల్, ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్లారు. నిర్మల్ వద్ద గుడియాను దించి తిరిగి వెనక్కి పంపించారు. అరెస్టయిన వారిలో ప్రధాన నిందితుడయిన మహేంద్ర చౌదరి భార్య గుడియా జాత్, బన్సీరామ్ అలియాస్ మనీష్ దివాసి, మనీష్ వైష్ణవ్, రితేష్ వైష్ణవ్, సుమీర్ చౌదరి, గజ్వేల్‌కు చెందిన మహ్మద్ ఫిరోజ్ ఉన్నారు. మహేంద్ర చౌదరి, సుమిత్ డాగర్, మనిష్, మనియా పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 1.35 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, 3 కంట్రీ మెడ్ పిస్టళ్లు, ఒక ఎయిర్ పిస్టల్, 3 బైక్‌లు, కారు, 65 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అటవీ సంరక్షణ బిల్లును ఉపసంహరించాలి

- దరఖాస్తు పెట్టుకున్న పోడు రైతులందరికీ హక్కుపత్రాలివ్వాలి
- గిరిజన బంధు పథకాన్ని తక్షణమే ప్రారంభించాలి
- టిజిఎస్ సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అటవీ సంరక్షణ నియమాలు 2022 బిల్లును ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గిరిజన హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని వక్తలు విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో హామీ ఇచ్చినట్టుగా తెలంగాణ గిరిజన యూనివర్సిటీ తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన జనాభా ప్రకారం పది శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. రాష్ట్రంలో పోడు సమస్య తీవ్రంగా ఉందనీ, దరఖాస్తు పెట్టుకున్న పోడు సాగుదారులందరికీ వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. దళిత బంధు తరహాలో గిరిజన బంధు పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గిరిజన సంఘం (టిజిఎస్) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం 'గిరిజన హక్కులు- సవాళ్లు' అనే సెమినార్ నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షులు ఎం. ధర్మనాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడూతూ దేశంలో 715 గిరిజన తెగలు, 15 కోట్ల మంది గిరిజనులున్నారనీ, వారిని అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా అడవులు, అటవీ సంపదను అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు వచ్చే పార్లమెంటు సమావేశాల్లో అటవీ సంరక్షణ నియమాలు-2022 బిల్లును ప్రవేశపెడుతోందని విమర్శించారు. ఆ బిల్లు చట్టరూపం అయి అమలైతే దేశంలో అడవులపై ఆధారపడ్డ లక్షలాది మంది ఆదివాసీ, గిరిజనులు బలవంతంగా అడవుల నుంచి గెంటి వేయబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మేయడం వల్ల గిరిజనులు, దళితులకు కల్పించిన రిజర్వేషన్లు పూర్తిగా నిర్వీర్యమవుతున్నాయని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని ప్రవేశపెట్టేందుకు అనేక కుట్రలు చేస్తుందన్నారు. గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయకపోవడం వల్ల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని చెప్పారు. తెలంగాణ ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ లావుడియా జీవన్‌లాల్ మాట్లాడుతూ.. గిరిజనులుగా పుట్టి గిరిజనుల కోసం మాట్లాడం 'నా జన్మ హక్కు' అన్నారు. దేశంలో విద్యుత్తు, ప్రాజెక్టుల నిర్మాణాల పేరుతో లక్షలాది మంది గిరిజనులు నిర్వాసితులవుతున్నారనీ, వారిచ్చిన త్యాగాలతోనే కరెంటు, సాగునీరు వంటి అవసరాలు తీరుతున్నాయని అన్నారు. దేశంలో ఉక్కు పరిశ్రమలకు ఖనిజ సంపద మొత్తం గిరిజన ప్రాంతాల నుంచి సరఫరా అవుతుందనీ, కానీ ఆ ప్రాంతాల్లో గిరిజనులకు విద్య, ఉపాధి, ఉద్యోగాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వైద్య సౌకర్యం లేక వందల మంది గిరిజనులు చనిపోతున్న దృశ్యాలు కలిసి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం గిరిజన జాతుల్లో పుట్టిన మనం ఎవరు వ్యతిరేకించినా మన పని చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ముఖ్యమైన హామీలను కొన్ని అమలు చేసిందనీ, ఇంకా కొన్ని అమలు చేయాలని కోరారు. రాబోయే కాలంలో పోరాటాలు నిర్వహించాలన్నారు. సిఎం ప్రకటించినట్టుగా గిరిజనులకు గిరిజన బంధు పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసినా తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని అన్నారు. ఒక్కో తండా గ్రామపంచాయతీకి కోటి రూపాయల నిధులు ప్రత్యేకంగా ఇచ్చే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో 2023 ఫిబ్రవరిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంఘం రాష్ట్ర నాయకులు డి.రవినాయక్, భూక్యా వీరభద్రం, గుగులోత్ భీమా నాయక్, అంగోత్ వెంకన్న, ఎం బాలునాయక్, వి.వీరన్న, కొర్ర శంకర్, ఎం.శంకర్, ఎం.రవినాయక్, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

